కాంగ్రెస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- పోలీసులకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫిర్యాదు

ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జూలై 2: ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే అనే గౌరవం ఇవ్వకుండా నోటికి వచ్చినట్లు దూషించిన కాంగ్రెస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. రెబ్బెన మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెబ్బెన మండలంలో ఇటీవల మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేనైన తనను కాంగ్రెస్ నాయకులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రెబ్బెన మండలంలో కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా దూషించారని, వీరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మన్నెం పద్మ, కార్యకర్తలున్నారు.

పాలిటెక్నిక్ విద్యతో మంచి భవిష్యత్

సీసీసీ నస్పూర్, జూలై 2 : పాలిటెక్నిక్ విద్యతో మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. సీసీసీ నస్పూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో కార్మికుల పిల్లలకు కేటాయించిన సీట్లకు మంగళశారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్మికులు, రిటైర్డ్ కార్మికుల పిల్లలకు యాజమాన్యం యేటా 150 సీట్లు కేటాయిస్తున్నది. ఈ కౌన్సెలింగ్‌కు సింగరేణిలోని ఆయా ఏరియాల నుంచి పిల్లలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి కౌన్సెలింగ్ సెంటన్‌ను పరిశీలించారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ఆయన అడ్మిషన్లు అందజేశారు. మొత్తం 150 సీట్లకు 46 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

అధికారులతో సమీక్ష..

శ్రీరాంపూర్, జూలై 2 : శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో అధికారులతో జీఎం సంజీవరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీల్లో పరిశుభ్రత పనులు నిర్వహించాలని సివిల్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్మికుల కాలనీల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్మిక కుటుంబాలకు వ్యాధులు సోకకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీవైజీఎం అరవిందరావు, ఇన్‌చార్జి సివిల్ రాము, సివిల్ ఈఈ సత్యనారాయణ, గట్టయ్య, హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం

శ్రీరాంపూర్, జూలై 2 : ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని మేనేజర్ తిరుపతి పేర్కొన్నారు. ఆర్కే–6 గనిపై మంగళవారం వైద్య ఆరరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు ఏర్పాటు చేశారు. మేనేజర్ తిరుపతి, హెల్త్ ఆఫీసర్, డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడారు. గని సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, ఈఈ శ్యామ్‌కుమార్, మహేశ్, డీవైపీఎం కే సునీల్‌కుమార్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంగం సదానందం, నాయకులు నర్సయ్య, లక్ష్మయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన : దేవులగూడలో మిల్లెట్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 2 : సరైన పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజరాజేశ్వరి మిల్లెట్ యూనిట్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలు అత్యధికంగా పోషక విలువలు కలిగి ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయడం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. యూనిట్ నిర్వహణకు వినియోగించిన పెట్టుబడి, పని చేస్తున్న వర్కర్లు, అంగన్ వాడీలకు చేస్తున్న పంపిణీ వివరాలను పరిశీలించి, మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషిచేయాలన్నారు. నానో సంచులు వినియోగించాలని, నిషేధిత ప్లాస్టిక్‌ను నిరోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం సారయ్య, ఏపీఎం శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దేవులగూడలో..

రెబ్బెన, జూలై 2 : రెబ్బెన మండలం దేవులగూడలో సెర్ప్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మామ్స్ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి కలెక్టర్ సందర్శించారు. యూనిట్‌లో తయారు చేస్తున్న చిరుధాన్యాల బిస్కెట్లు, స్నాక్స్, కేక్‌లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. రూ.63.25 లక్షలతో ఏర్పాటు చేసిన మామ్స్ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఆరోగ్యకరమైన చిరుధాన్యాల ఉత్పత్తులను తయారీ చేయడం సంతోషకరమన్నారు. అనంతరం నక్కలగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి, మరమ్మతులను పరిశీలించారు. డీఆర్డీవో సురేందర్, అదనపు డీఆర్డీవో రామకృష్ణ, డీఈవో అశోక్, డీఈ రాజన్న, ఏఈ ఖాద్రీ, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఏపీఎంలు వెంకటరమణశర్మ, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల సమాచారం ఇవ్వండి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- 'ఆపరేషన్ ముస్కాన్'పై సమీక్ష

పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

మంచిర్యాల అర్బన్, జూలై 2: బాలకార్మికుల వివరాలు తెలిస్తే 1098, లేదా 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని, పోలీసులకు తెలియజేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ప్రజలను కోరారు. జూలై 1 నుంచి 31వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలు గొర్రెలు, పశువుల కాపరులుగా, కిరాణా, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫామ్, ఇతర పరిశ్రమల్లో పని చేస్తే, భిక్షాటన చేసినా వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. లేదా స్టేట్ హోమ్‌కు పంపించాలని తెలిపారు. పని చేయించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. విడిపోయినా తప్పిపోయిన పిల్లలను గుర్తించేందుకు 'దర్పన్' సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పెద్దపల్లి శ్రీధర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మంచిర్యాల చైర్మన్ వహీద్, మంచిర్యాల డీడబ్ల్యూవో చిన్నయ్య, మంచిర్యాల డీఎంహెచ్‌వో అనిత, ఆపరేషన్ ముస్కాన్ టీం పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గనుల వేలంపై పోరాటాలు ఉధృతం

- ఎస్‌సీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

సీసీసీ నస్పూర్, జూలై 2 : బొగ్గు గనుల వేలాన్ని నిలుపుదల చేసే వరకు తమ పోరాటాలను ఉధృతంగా కొనసాగిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాల అందజేత కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. 6 నుంచి 12వ తేదీ వరకు జీఎం కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను వేలం వేసిందని, అరవిందో, అవాంతిక కంపెనీలు దక్కించుకున్నాయని పేర్కొన్నారు. మిగిలిన శ్రావణపల్లి, కేకే–6కు వేలం వేస్తున్నారని ఆరోపించారు. గుజరాత్, ఛతీస్‌గఢ్, ఒరిస్సాలో నామినేషన్ పద్ధతిలో గనులను ఆయా రాష్ట్రాలకు కేటాయించిందని, ఇదే మాదిరిగా సింగరేణికి బ్లాకులను కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందించినప్పటికీ స్పందించలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకించి, ఇప్పుడు అధికారంలోకి రాగానే మంత్రులే నేరుగా వేలంలో పాల్గొనడం సరికాదని మండిపడ్డారు. సింగరేణికి భవిష్యత్ ఉండాలంటే తప్పకుండా కొత్త గనులు రావాలని, లేకపోతే కష్టంగా మారుతుందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు వీరభద్రయ్య, బాజీసైదా, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, మురళీచౌదరి, లింగం రవి, మోహన్‌రెడ్డి, కొమురయ్య, అఫ్రోజ్‌ఖాన్, నర్సింహారావు, మిర్యాల రాజేశ్వర్‌రావు, నర్సింగరావు పాల్గొన్నారు.

ఎస్సార్పీ–3 గనిపై..

శ్రీరాంపూర్, జూలై 2 : శ్రీరాంపూర్ ఎస్సార్పీ–3 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీతారామయ్య మాట్లాడారు. సింగరేణిలో బొగ్గు గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని, కార్మికులు కలిసి వచ్చి, వేలాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కె సమ్మయ్య, దాడి రాజయ్య, లచ్చన్న, వేణు, మల్లేశ్, రమణ, సురేశ్, శ్రీకాంత్, విక్కీ, రామోజీ పాల్గొన్నారు.

సీఎంఎస్ కంపెనీని మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ రత్నపురం ప్రకాశ్

అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆమంచిర్యాల అర్బన్, జూలై 2 : సీఎంఎస్ కంపెనీ కస్టోడియన్‌లో విధులు నిర్వహించే దండేపల్లి నెల్కి వెంకటాపూర్‌కు చెందిన బోడకుంట మోహన్, సీసీ నస్పూర్‌కు చెందిన రేణికుంట్ల పూర్ణచందర్.. సొంతానికి డబ్బు వాడుకొని మోసం చేసినందుకు అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రత్నపురం ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సీఎంఎస్ కంపెనీ కస్టోడియను బోడకుంట మోహన్, రేణికుంట్ల పూర్ణచందర్.. నిత్యం బ్యాంక్ నుంచి నగదు తీసుకొని ఏటీఎంలలో జమ చేసేందుకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఆరు నెలలుగా కొంత డబ్బు కాజేసి, ఇద్దరు సమానంగా సొంతానికి ఉపయోగించుకున్నారు. జూన్ 26న ఆడిట్ వారు, ఏటీఎం తనిఖీకి వస్తున్నారని తెలుసుకున్న నిందితులు.. మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి, పారిపోయాడు. ఆడిట్ సోదాలో సుమారు రూ.1,25,24,400 కాజేసినట్లు గుర్తించి, మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు నిందితులు మంచిర్యాల బస్టాండ్‌కు వచ్చారని తెలిసి, పట్టుకున్నారు. వారిని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.50 వేలు, ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్ పేపర్లను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ వెల్లడించారు.

అభివృద్ధి వివరాలు సమర్పించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 2 : జిల్లాలో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవాం జిల్లా వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీ, పశు వైద్య, గిరిజనాభివృద్ధి, సంక్షేమ, వ్యవసాయ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కింద జిల్లాలో సంబంధిత శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కార్యక్రమాల కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సంబంధిత పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పశు వైద్యాధికారి సురేశ్, ఏపీడీ రామకృష్ణ, నీతి అయోగ్ జిల్లా సమన్వయకర్త మణివేలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయక పోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్టు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్టు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కేఐవోఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఎల్ఐ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే–ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.

ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5–7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య

వెస్పా స్కూటర్ ధర 14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ–పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

మాల్యాకు ఎన్బీ డబ్ల్యూ

ముంబై, జూలై 2: పరారీ వ్యాపారవేత్త విజయ్ మాల్యాపై తాజాగా మరో నాన్–బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ)కు రూ.180 కోట్ల రుణం ఎగవేశారన్న కేసులో ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎస్పీ నాయక్ నింబాల్కర్ ఎన్బీడబ్ల్యూకు ఆదేశించారు. 2007 నుంచి 2012 మధ్య మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ఈ రుణాలను తీసుకున్నది.

సింగరేణి లక్ష్యం 2 లక్షల టన్నుల ఉత్పత్తి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు రోజుకు 2లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (మట్టి)ని తొలగించాలన్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో కలిసి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ వంటి అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

హైదరాబాద్‌లో ఫినోమ్

హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో రూ.249కి అందిస్తుండగా, ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.379గా ఉన్నది. జియో కస్టమర్లు 9 శాతం తక్కువ ధరకే ఈ ప్లాన్ లభిస్తుండటం విశేషం. మరోవైపు, మూడు నెలల ప్లాన్ విషయానికి వస్తే 6జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్‌ను జియో రూ.479కి అందిస్తుండగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు ఆరు శాతం అధికంగా రూ.509కి అందిస్తున్నాయి. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ జియో ధర రూ.799 ఉండగా, అదే పోటీ సంస్థలైన ప్లాన్లు 8 శాతం ఎక్కువగా రూ.859కి అందిస్తున్నాయి.

ఫార్మాకు భూముల కొరత!

- ప్రకటించిన మూడు జిల్లాల్లోనూ అడ్డంకులే
- కొత్తగా రెండు ప్రాంతాలు ఎంపిక చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఫార్మా విలేజ్‌లు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతుండగా.. తాజాగా భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్, వికారాబాద్ తదితర మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా..ఈ మూడు చోట్ల భూముల లభించే పరిస్థితి లేదని ఆయా జిల్లా కలెక్టర్లు తేల్చిచెప్పారు. అయితే జహీరాబాద్‌లో భూసేకరణ అవకాశం ఉండగా, వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని సర్కార్ యోచిస్తున్నది. దీంతో మొదటిదశలో ఈ రెండు ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారుగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఫిబ్రవరిలో జరిగిన బయో ఏషియా సదస్సులో ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో 1000 నుంచి 2 వేల ఎకరాల స్థలంలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫార్మా పరిశ్రమలు కాలుష్యంతో కూడిన రెడ్ జోన్ పరిధిలోకి వస్తాయి కాబట్టి, వీటి ఏర్పాటునకు స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు కూడా ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది.

ఎకోసిస్టం లేకుండా సాధ్యమేనా..

పరిశ్రమల ఏర్పాటునకు సంబంధించి పర్యావరణ వ్యవస్థ(ఎకోసిస్టం) అభివృద్ధి కావడం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు రాష్ట్రంలో అనేక దిగ్గజ ఐటీ కంపెనీలు ఉన్నాయి. దీంతో వాటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో చిన్నాచితకా ఐటీ కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి పర్యావరణ వ్యవస్థ లేకుండా పరిశ్రమల మనుగడ సాధ్యంకాదు. ఫార్మా రంగం విషయానికొస్తే, ఇప్పటికే జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలు కొలువుదీరాయి. జీనోమ్ వ్యాలీలో అనేక కంపెనీలు తమ పరిశోధన కేంద్రాలను నెలకొల్పాయి.